కీలుబొమ్మ

రైలు ప్రయాణం చేసేటప్పుడు మొత్తంమీద రకరకాల మనుష్యులు తటస్త పడుతుంటారు...

అతనంతట అతనే నన్ను పలకరించాడు. నాకు నేనై కొత్తవాళ్ళను పని లేకుండా సామాన్యంగా పలకరించను. ఎందాకా నన్నాడు, చెప్పాను. ఎక్కణ్నించన్నాడు. అదీ చెప్పాను. ఏవేవో సంగతులు తెచ్చాడు. అతని ఉత్సాహం, స్నేహభావం నాకు అంటుకున్నై. మనిషి చాలా అందంగా నాజూకుగా ఉంటాడు. అతని మొహంలో ఆనందం, ఆరోగ్యం తాండవిస్తుంటై. అతని జన్మలో చింతకాని, ఆగ్రహం కాని ఉన్నట్టులేదు. అతని మొహాన నవ్వటానికలవాటుపడ్డ లక్షణాలున్నై. కాని కోప్పడటానిక్కాని, దుఃఖించటానిక్కాని ఆ మొహం అలవాటు పడ్డట్టులేదు. డబ్బు పుష్కలంగా ఉండి విరివిగా ఖర్చు పెట్టే మనిషల్లే కనపడ్డాడు. అతిశయంకాని, బెట్టుసరి కాని వున్నట్టు లేదు మనిషి దగ్గిర. ఎక్కువ తెలివిగల వాడల్లే కనిపించలేదు కాని మందమతి కాదు.

మా సంభాషణ ఎట్లా వెళ్ళిందో 'విధి' మీదికి వెళ్ళింది.

"మనుషులకు విధి ఉన్నట్టే దేశాలక్కూడా విధి ఉంటుంది కామాలు?" అన్నాడతను.

నేను నవ్వి, "మనుష్యులకు విధి ఉంటుందని రుజువెక్కడయింది?" అన్నాను.

అతనాశ్చర్యంతో "ఎందుక్కాలేదు?" అన్నాడు. అతని మొహాన ఆశ్చర్యం చూసినప్పుడు ఒక కొత్త విషయం కనిపెట్టాను. ఆశ్చర్యంలో కూడా నవ్వటానికి వీలున్నప్పుడు, నవ్వులో ఎందుకు నవ్వకూడదు? అందుచేతనే అతని నవ్వులో వెన్నెల్లు కాయటం! బహుశా అందుకనే కొందరి నవ్వు చవితి వెన్నెలల్లే ఉంటుంది.

సరే నేను "ఎక్కడయిం"దన్నాను. అతను నవ్వుతూ "నేను రుజువు చేశాను" అన్నాడు.

"ఉండండుండండి! మీ ఉద్దేశంలో విధి అంటే ఏమని? ఎందుచేతంటే కర్మ ఫలితాన్ని నేను విధి అని అంగీకరించను. పంచదార తీపిగా వుంటానికే విధీ సహాయం చెయ్యక్కర్లేదు. అదే విధి అయితే దేశాలక్కూడా విధి ఉంది. కొద్దిమంది వ్యక్తులు చేసిన కర్మయొక్క ఫలితం దేశమంతా అనుభవిస్తుంది. అప్పుడే దేశాలక్కూడా విధి ఉంటుంది మరి."

అతను మెల్లిగా తల అడ్డంగా తిప్పాడు.

'అదికాదు నేను చెప్పే విధి. విధంటే మనం మనో వాక్కాయలా చేసే కర్మకు సంబంధం లేకుండా మన భవిష్యత్తును నిర్ణయించేది. అటువంటి విధంటూ ఉందని మీరు నమ్ముతారా?"

"ఎన్నటికీ నమ్మను! ఖచ్చితంగా చెప్పగలను. తన యిష్టానుసారం మనల్ని నడిపించే విధి ఉందని ఎవరైనా నిరూపిస్తే నేను జీవితంలోనూ, న్యాయంలోనూ, ధర్మంలోనూ అర్థం లేదని ఒక్క క్షణంలో నిరూపిస్తాను" అన్నాను.

"మీరు చెప్పింది నిజం. వాటిల్లో అర్థం లేదనే తీర్మానానికి నేనూ అదివరకే వచ్చాను. వాటిని నేనిప్పుడు పాటించటం లేదు" అన్నాడతను.

నేను నిర్ఘాంతపోయినాను. అతను అబద్ధం ఆడుతున్నాడో, లేక న్యాయం, నీతి, ధర్మం మొదలయినవి పాటించని వాడి మొహాన 'లుచ్చా' అని రాసి వుంటుందని నే నింతకాలం అనుకోటం పొరపాటా? ఇటువంటి వాటికి సంఘంలో ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నామని రుజువైతే ఇప్పుడు చేస్తున్నట్టుగా ప్రతివాడూ మిగిలినవాళ్ళ లోపాలేరుతూ కాలయాపన చెయ్యకుండా చాలా సుఖంగా జీవించవచ్చునేమో?

"ఏమిటాలోచిస్తున్నారు?" అన్నాడతను.

"అంటే, మరేమీలేదు. మీరు ఒక మాటకు ఒక మాట ఉపయోగిస్తున్నారేమోనని నా అనుమానం!.... ముందు విధంటూ ఉందని రుజువు చెయ్యండి చూద్దాం! తరవాత నా ఆలోచన చెబుతాను."

అతను బిగ్గరగా నవ్వి "విధంటూ లేదని మీ కెట్లా తోచిందండీ! ప్రతి రయితూ సాలుకు కొన్ని లక్షల వరి మొక్కలు తదితర జీవాలను తన ఇచ్ఛానుసారం పెంచి చంపుతున్నాడు. మనం మన పెంపుడు జంతువులను మన ఇష్టానుసారం పెంచటమేకాక మన యిష్టం వచ్చిన కొత్త జాతులు పుట్టిస్తున్నాం. సృష్టికి మనిషే నాయకుడా? మనిషి మీద ఇంకా ఎన్ని రకాల జీవరాసులున్నాయో?" అన్నాడు.

"ఉంటే కనిపించవేం?"

"మనం చెట్లకేం కనిపిస్తాం?"

"అదా మీ వాదన? అసలు చెట్లకు ప్రాణం ఉందని అంతా ఒప్పుకోలేదు?" అని ఒక చొప్పదంటు వాదన అడ్డం పెట్టాను.

"మనకు ప్రాణం వుందని ఎవరు రుజువు చేశారు. ఎవడో కథలో రాక్షసుడి ప్రాణం ఎక్కడో దాచిపెట్టి ఈగల్లో ఉన్నట్టు మన ప్రాణం గుండెకాయ మొదలైన వాటిలో ఉండవచ్చును. అవివేరే ప్రాణులు కావని ఎవరు నిరూపించారు? అటువంటి తెలీని

విషయాలు మనకొద్దు. చెట్లు కర్మ చేస్తున్నై. వాటికి మంచి చెడ్డలున్నై. చెట్టు తన మేలుకోసరం ఆకులను చీల్చుకుంటుంది. రాల్చుకుంటుంది. అది కర్మ కాదా? దాని ఆహారం అది వెతుక్కుంటుంది. మనం అంతకన్న చేస్తున్నదేమిటి? మనకన్న తక్కువ తరగతి ప్రాణులను చూసి మనమే ఉన్నతంగా ఉన్నామని అహంకరించటం ఎందుకు? మనకన్న పెద్ద తరగతి జీవాలు కొన్ని పరిపాలిస్తున్నట్టు నేను గట్టిగా నమ్మాను. వాటికి మనం లొంగి ఉండక చేసేదేమీ కనిపించలేదు."

"మనకన్న ఎక్కువవాళ్ళు మనల్ని కీలుబొమ్మ లాడించినట్టు ఆడిస్తున్నారని మీ కెట్లా నమ్మకం కలిగింది?"

"వినండి. నేను చిన్నతనంలో రెండుసార్లు చచ్చి బతికాను. మాటవరస కనటం కాదు. నిజంగా చచ్చి బతికాను! మా నాన్న గొప్ప డాక్టరు. రెండుసార్లు కూడా ఆయనా ఆయన స్నేహితులయిన పెద్ద డాక్టర్లు నా ప్రాణం పోయిందని సర్టిఫై చేశారు. రెండుసార్లు కూడా ఒక ఔషధ సహాయం గాని ఒక చికిత్స గాని లేకుండానే బతికాను. నన్నెవరు బతికించారు?

"నా జీవితంలో ఇటువంటివి శత సహస్రాలు; నా వివాహం గురించి చూడండి. నా పెళ్ళి నిశ్చయమైన కొద్ది కాలానికే యీ సంబంధం నా యజమానికి – నన్ను ఆడిస్తున్న దేవతకు – యిష్టం లేదని నాకు తట్టింది. ఎవరితోనూ చెప్పలేదు. ఆ వివాహం అయిదు రోజులూ నాకు ఇదీ అదీ అని తెలీని రోగం! నా భార్య కాపరానికి వచ్చిన తరవాత మా ఇద్దరిమధ్యా ఎవరో అడ్డం వస్తూనే ఉండేవాళ్ళు పానకంలో పుడకల్లే. ఏమీ జరక్కుండానే నా ఉత్సాహం యావత్తూ ఎక్కడికో పీల్చుకుని పొయ్యేది. అటువంటిది కేవలం సైకలాజికల్ అని అనగల్రు. నేనప్పటికీ విధిలో నమ్మకం కలవాణ్ణి కాను. ఈ కనిపించని భూతం, నాకూ నా భార్యకూ మధ్య పెట్టని గోడ అయిపోయింది. నా భార్య చాలా మంచిది. మొదట్లో నాకు దాన్ని చూస్తే ఎంతో ప్రేమ. నా భార్య ఎదురుగా రాగానే నా కళ్ళలో కారం కొట్టినట్టయ్యేది. లోపలనించి విపరీతమయిన అసహ్యం పుట్టేది.

"చాలాకాలం ఈ దయ్యాన్ని తోలెయ్యాలని ప్రయత్నం చేశాను! అప్పటికింకా ఈ దయ్యం నాలోనే ఉందని నా భ్రమ. నాకు బాహ్యంగా వుందని తెలీదు.... చివరకు నా భార్యను వదిలేశాను!

"ఆ రోజుల్లో నా స్థితి భయంకరంగా ఉంటూ వచ్చింది. మా నాన్న ఏమీ మిగిల్చి పోలేదు. ఇన్సూరెన్సు ప్రీమియములు కట్టడం మానేసి దాన ధర్మాలు చేశాడు! నా విద్యాభ్యాసం మధ్యలో తెగిపోయింది.

"నా భార్యను పుట్టింటికి పంపించేసిన మర్నాడు నే నెన్నడూ ఎరగని పెద్దమనిషి మా నాన్న స్నేహితుణ్నంటూ వచ్చి నాకు ఉద్యోగం ఇస్తానన్నాడు.

"నాకు బోగం వాళ్ళంటే ఎప్పుడూ అసహ్యమే! ఒక రోజున నేను సాని వీధి వెంబడి పోతుండగా నన్నెవరో ఒక యింట్లోకి పొమ్మని ప్రేరేపించి నట్టయింది. ఆ యింటిది తాగుబోతు, ఉత్త దరిద్రపు లంజ. నాకు దాన్ని చూస్తే ఆవగింజంత ప్రేమ లేకపోగా పరమ అసహ్యం. అయినా ఆ యింట్లో దూరాను. మర్నాడు ఒక పెద్దమనిషి నన్ను ఒక బాంకు ఏజంటు దగ్గిరికి తీసుకుపోయి నెలకు డెబ్భై రూపాయల మీద నన్ను గోడౌన్ కీపర్‌గా నియమింప చేశాడు. నాకా పని కూడా తెలీదు. ఆ ఉద్యోగంలో ఉంటూ నా కిష్టంలేనివీ ఎవడయినా వింటే నోట్లో ఉమ్మేసేవీ అనేక పనులు చేశాను. నా మీద కేసులు కూడా వచ్చినాయి. నన్ను నా యజమాని దివ్యంగా తప్పించాడు. నా ప్రయత్నం ఏమీ లేదు. నా అభివృద్ధికి ఏమీ లోపం రాలేదు. కొద్దికాలం కిందటే నన్ను ఏజంటు చేశారు. ఇప్పుడు రొండువందల యాభై యిస్తారు!...

"నేనిప్పుడు ఎవర్నీ తప్పు పట్టను. నన్ను తప్పుపడితే సహించను! నా జీవితానికి నా అనుజ్ఞ ఎంత మాత్రం లేకుండా ఉంటున్నది. నేనేం చెయ్యాలి? నన్ను పట్టిన గ్రహం చాలా దుష్టగ్రహంగా కూడా ఉంది! భగవంతుడనే వాడుంటే అతన్ని చాలా కాలం నించి ప్రార్థిస్తున్నాను నన్ను మంచి గ్రహం చేతిలో పారెయ్యవయ్యా అని. ఇంకా నా మొర ఆలకించలేదు భగవంతుడు."

నేను కొంచెం సేపు ఆలోచించి, "చాలా విచిత్రంగా ఉంది. నిజమయితే! కాని ఒక్క కేసును బట్టి ఏమీ తేల్చలేం" అన్నాను.

"ఒక్క కేసా! వందలూ, వేలు చూపిస్తాను! మీరా మాట అనటంబట్టి మీరీ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదని తెలుస్తుంది. నా అనుభవం ఒకటి వినండి. నేను ఒకప్పుడు ప్రతి ఆడదీ పతివ్రతే అనుకునే వాణ్ణి. అప్పుడు నాకు రంకువాళ్ళను గురించి ఆలోచనే లేదు. తరవాత ఎందుచేతనో ఆ విషయం ఆలోచన వచ్చినప్పుడు గమనిస్తే దాదాపు నేనెరిగిన ప్రతి ఆడదీ రంకుతనం చేసిన మనిషే! ఇంటికొకత్తె. అనేక విషయాలను గురించి ఆలోచించక మనం జీవితంలో నూటికి తొంబై తొమ్మిది పాళ్ళు అసలు చూడనే చూడటం లేదు – విచారించటం మాట దేవుడెరుగు! – నేనిప్పుడు నా జీవితంలో నలుసులన్నీ ఏరి తెచ్చాను కనుక నా జీవితం విపరీతమైనట్టు మీరు భావించుకుంటారు. కాని అందరి బతుకంటిదే నాది కూడా. కారణం లేకుండా నా భార్యను వదిలేసిన వందల్లో నేనొకణ్ణి. లంచాలు పుచ్చుకుంటున్న వేలల్లో నేనూ ఒకణ్ణి. ముండల ఇళ్ళచుట్టూ తిరిగి సాధ్యమైనంత వరకూ తప్పించుకుంటూ పొరపాటున తగిలితే వెంటనే నయం చేసుకుంటూ తిరుగుతున్న కొద్ది మందిలో నేనొకణ్ణి. నన్ను బాగా ఎరిగినవాళ్ళు విపరీతంగా చూడనే చూడరు!"

నేననుమానంగా తల ఊపాను.

"అందుకనే కృష్ణుడీ తక్కువ దేవతలను కొలవక తన్నే నమ్మి వుండమన్నాడు! వీళ్ళను జయించటానికి ఇంద్రియ నిగ్రహం కావాలి!"

"అదీ ఆలోచించాను. ఆ భగవంతుడి స్వరూపం తెలిస్తే కదా ఆయన్ను నమ్మటమనేది జయప్రదంగా జరిగేది. నేను నమ్మే ఉన్నాను. ఇక తక్కువ దేవతలను ఎదిరించటం మాటా? మనిషికి ఎదురు తిరిగిన కుక్క మనిషికన్న ఎక్కువే అవుతుందో తోడేలే అవుతుందో? నాకు వృద్ధి పొందాలనే ఉంది. కాని క్షీణించాలని లేదు. ఇప్పటి మట్టుకు ఒక్కపని చేస్తున్నాను. నన్ను రెండు భాగాలు చేసుకున్నాను. ప్రస్తుతం అందులో ఒక భాగం మాత్రమే విధికి లొంగి ఉన్నట్టూ రెండో భాగం దానికి ఎడంగా ఉండి దాని మంచి చెడ్డలను నిశ్చింతగా గమనిస్తున్నట్టూ నటిస్తున్నాను. అసలటువంటి రెండో భాగం నాలో ఉన్నట్టే ఉంది. కేవలం సైకలాజికల్ ఎఫెక్టే కావచ్చును మరి!" అంటూ అతను నవ్వాడు.

మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, అక్టోబర్ 1935